అక్రమ నిర్మాణాలపై కొరడా..!

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రభుత్వ భూములు, కొండ కాలువలు అక్రమణలకు పాల్పడి నిర్మాణ పనులు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పలాస తహసిల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. శనివారం ఆక్రమణ స్థలాలపై కొరడా ఝుళిపించారు. పలాస ఆర్టీసీ డిపో ఎదురుగా పురుషోత్తపురం సర్వేనెంబర్ 22/7లో కొండ కాలువపై కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని నోటీస్ బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. భవన నిర్మాణ స్థలం మీదుగా విద్యుత్ వైర్లు ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందని, ఎప్పటికైనా ప్రమాదకరమని తెలియజేసిన ఆక్రమణదారులు నిర్మాణ పనులను కొనసాగిస్తూ వస్తున్నారని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు నోటీస్ బోర్డ్ ఏర్పాటు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టిన ఆక్రమణదారులపై, మేస్త్రి లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నోటీస్ బోర్డ్ ఏర్పాటు చేసిన వారిలో ఆర్ ఐ కంచరాన ఖగేష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రతి పేదవాని కళ్ళల్లో ఆనందం చూడాలి : ఎమ్మెల్యే శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ప్రతి పేదవాని కళ్ళల్లో ఆనందం చూడాలనేదే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతీ పేదవానికి పింఛను సకాలంలో అందిస్తున్నామని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. ఈనెల ఒకరోజు ముందుగానే అందించటం ఆనందంగా ఉందని, పింఛను అందుకునేటప్పుడు ఆ పేదవాడు ఆనందానికి హద్దులు లేవన్నారు. రూరల్ మండలం పోన్నాం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు అన్ని వర్గాల వారికి ఆసరాగా పింఛన్ల పంపిణీ ఓ జాతర్ లా సాగుతుందని, ప్రజా సంక్షేమమే మాకు ముఖ్యమని తెలిపారు. ఆర్థిక స్వావలంబన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ పింఛన్ల పథకం అందరికీ సంతోషం కలిగిస్తుందని, వారి జీవనానికి ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను గుర్తించి, ఎవరికి అన్యాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకొని సకాలంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు, అనంతరం పంచాయతీలో నవనంబాడు, గొల్లపేట గ్రామాలలో సిసి రోడ్లు, కాలువాల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు 20 రోజులు శిక్ష

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : హెడ్ కానిస్టేబుల్ పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వారు 20 రోజులు శిక్ష విధించినట్లు శ్రీకాకుళం టౌన్ సిఐ పి. పైడిపు నాయుడు తెలిపారు. శ్రీకాకుళం మంగువారి తోటలో నివాసం ఉంటున్న పొన్నాడ త్రినాధరావు హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ (ప్రస్తుతం శ్రీకాకుళం డి.సి.ఆర్.బి లో పనిచేస్తున్నట్లు) తేదీ 29.05.2025న రాత్రి ఇంటికి తన మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, రాత్రి సుమారు 7:20 నిమిషాల సమయంలో లెపర్సీ కాలనీ జంక్షన్ వద్ద బోడెమ్మ కోవెల వీధికి చెందిన వెల్లంపూడి రాజేష్, దమ్మల వీధికి చెందిన పొట్నూరు వాసు, ఇద్దరు కలిసి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ, దారిన పోయే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అది గమనించిన హెడ్ కానిస్టేబుల్ త్రినాధరావు వారు చేస్తున్న పని తప్పని ప్రశ్నించగా మద్యం మత్తులో ఉన్న ఇరువురు కలిసి అతనిపై చేతులతో దాడి చేసి, రక్త గాయములు కలుగజేయుగా, సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. రామారావు తక్షణమే సంఘటన స్థలం వద్దకు చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా ఇరువురు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిద్దరిని శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు నందు హాజరుపరచగా మేజిస్ట్రేట్ శివరామకృష్ణ ఒక్కొక్కరికి 20 దినములు చొప్పున శిక్ష విధించగా, వారి ఇద్దరినీ జిల్లా జైలుకు తరలించారు.

సిఆర్‌పిఎఫ్ జిల్లా కార్యదర్శిగా నర్సింహులు

విశాలాంధ్ర-సోంపేట : చైల్డ్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం (సిఆర్‌పిఎఫ్) జిల్లా కార్యదర్శిగా సోంపేట మండలం పొత్తంగి గ్రామానికి చెందిన సాలిన నర్సింహులను నియమిస్తూ సిఆర్‌పిఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ పి.ప్రకాష్ ఉత్తర్వులు అందజేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని పోస్టులో పంపించారు. బాలల హక్కుల పరిరక్షణ ప్రధాన ధ్యేయంగా కృషి చేయాల్సిన బాధ్యతలను నర్సింహులకు అప్పగించారు. మూడేళ్ల కాలం పాటు నర్సింహులు ఈ పదవిలో కొనసాగనున్నారు. నర్సింహులు నియామకం పట్ల అనేక మంది హర్షం వ్యక్తం చేశారు. నిరంతరం సామాజిక సేవల ద్వారా ప్రజా సంబంధాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోన్న సాలిన నర్సింహమూర్తికి సిఆర్‌పిఎఫ్ కార్యదర్శి పదవి రావడం అభినందనీయమని సోంపేటకు చెందిన ఎల్.గోవిందరాజులు పేర్కొన్నారు.

23కిలోల గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో నిందితుడు, రత్నాకర్ జిన్న

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని మడపాం టోల్ ప్లాజా వద్ద శనివారం ఉదయం నరసన్నపేట సి.ఐ, ఎం. శ్రీనివాసరావు, ఎస్.ఐ, సి హెచ్. దుర్గాప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తుండగా, బస్సు నుండి ఒక వ్యక్తి అనుమానస్పదంగా కిటికీ నుండి దూకి, పారిపోయాడు. హఠాత్తుగా స్పందించిన పోలీసులు పారిపోతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, వివరాలు సేకరించగా, ఆ వ్యక్తి నుండి సుమారు 23కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంధర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒడిస్సా నుండి హైదరాబాద్‌కు తరలిస్తున్న 23కిలోల గంజాయిని ఒడిస్సాకు చెందిన రత్నాకర్ జిన్న నుండి స్వాధీనం చేసుకున్నామని, జిన్న సూట్‌కేసును పరిశీలించగా, సుమారు 10ప్యాకెట్లలో గంజాయి, గంజాయి పువ్వులు, కాండం, మొగ్గలు గల ఘాటైన వాసన కల్గిన గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న రత్నాకర్ జిన్నను అదుపులోకి తీసుకొని, ఎన్‌డిపిఎస్ యాక్ట్ క్రింద కేసు నమోదు చేసి, విచారిస్తున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న సి.ఐ, శ్రీనివాసరావుకు, ఎస్.ఐ, దుర్గాప్రసాద్‌కు సిబ్బందికి ఏఎస్పీ, శ్రీనివాసరావు, ఎస్పీ, మహేశ్వరరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని పారద్రోలాలి : డిఎంహెచ్ఓ డాక్టర్ అనిత

విశాలాంధ్ర-శ్రీకాకుళం : గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని పారద్రోలాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత తెలిపారు. శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో పొగాకు వినియోగంకు వ్యతిరేకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఏడు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, నినాదాలు చేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత మాట్లాడుతూ పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమ యొక్క మాయ మంత్రాలను బయటపెట్టడం ఈ రోజు నుండి 15 రోజులపాటు పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా వ్యూహాత్మక కార్యచరణను ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి విద్యా సంస్థను పొగాకు రహిత విద్యాసంస్థలుగా ప్రకటించడం, గ్రామాలలో పొగాకు వినియోగాన్ని రూపుమాపే దిశగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సిగరెట్, పొగాకు ఉత్పత్తుల చట్టం-2003ను కఠినంగా అమలు పరచడం కోసం తీసుకోవాల్సిన చర్యలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీకాంత్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని డాక్టర్ మేరీ కాథరిన్, ఎన్సిడి వి ఓ డాక్టర్ ఇప్పిలి వెంకటరావు, డి ఐ ఓ డాక్టర్ రాందాసు, డిపిఎమ్ఓ డాక్టర్ రవీంద్ర, కార్యాలయ సిబ్బంది, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరామ థియేటర్ లో సినిమా ప్రదర్శనలు నిలుపుదల

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సినిమా థియేటర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పలాస రెవిన్యూ అధికారులు గత రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించారు. సినిమా థియేటర్ కు ఉండే అనుమతులు థియేటర్‌లో ఉండే సౌకర్యాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం సినిమా ప్రదర్శనలు జరుగుతున్నాయో.. లేదో.. ఆరా తీశారు. ప్రేక్షకులకు అమ్మకాలు చేస్తున్న టికెట్ రేట్లను పరిశీలించారు. దీనిలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఉన్న భాస్కర రామ థియేటర్ లో సినిమా ప్రదర్శనలకు లైసెన్స్ రెన్యువల్ చేయకపోవడంతో ఈ హాల్లో సినిమా ప్రదర్శనలు నిలుపుదలకు ఆదేశించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు వారు పేర్కొన్నారు. కాగా భాస్కర రామా థియేటర్ ను ప్రముఖ బంగారు వ్యాపారి పెంట భాస్కరరావు కుటుంబీకులు నిర్మించారు. కొన్నాళ్ళు వాళ్ల పరివేక్షణలో థియేటర్ ప్రదర్శనలు సజావుగా సాగుతున్న తరుణంలో నష్టాలు రావడంతో అద్దె ప్రాతిపదికన కొంతమందికి అప్పగించారు. గత మూడేళ్లుగా సతీష్ అనే వ్యక్తి థియేటర్ ను నిర్వహించారు. అయితే 2023లో థియేటర్ లైసెన్స్ కాల పరిమితి ముగిసిందని తెలుసుకున్న ఆయన థియేటర్ నిర్వహణను విడిచిపెట్టినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం క్రాంతి రెడ్డి అనే వ్యక్తి థియేటర్ నిర్వహణను చూస్తున్నారని సమాచారం. ఇటీవల అధికారులు తనిఖీ కి వెళ్ళినప్పుడు థియేటర్ కు సంబంధించి లైసెన్స్ లేకపోవడంతో రెవెన్యూ అధికారులు నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై పలాస తహసిల్దార్ టి.కళ్యాణ్ చక్రవర్తిని వివరణ కోరగా జంట పట్టణాల్లో గల సినిమా థియేటర్లను తనిఖీ చేశామని, అయితే భాస్కర రామా థియేటర్ కు సిబ్బంది తనిఖీ చేసే సమయంలో లైసెన్సు చూపించాలని కోరగా మరో వ్యక్తి వద్ద లైసెన్స్ ఉందని రెండు రోజుల్లో చూపిస్తామని తెలిపారని తహసిల్దార్ పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్ కు నివేదించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి..

8 మంది నిందితులు అరెస్ట్

విశాలాంధ్ర-పలాస: మండలం తర్లాకోట వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం దాడి చేసి 8 మంది నింధితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1,42,270 రూపాయల నగదును, రెండు ద్విచక్ర వాహనాలను స్వాదీనం చేసుకొని సీజ్ చేయడం జరిగిందని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి తెలిపారు. ఈ దాడితో తనతో పాటు కాశీబుగ్గ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

కార్టెన్ సెర్చ్ లో 27 ద్విచక్ర వాహనాలు సీజ్... పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరకోలనీ, రైల్వే కోలనీ రోడ్డు, పోస్టాఫీస్ రోడ్ తదితర ప్రాంతాలలో శనివారం వేకువన తమ సిబ్బందితో కలసి కార్టన్ సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు.

ఓటరు జాబితాలో మార్పులపై సమావేశం

విశాలాంధ్ర-టెక్కలి : ఎన్నికల కోసం ఓటరు జాబితాలో చేయాల్సిన మార్పులు చేర్పులను అధికారులు దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శనివారం వివిధ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ఫార్మ్ 16 పై వివిధ పార్టీల సూచనలు, సలహాలు, ఫిర్యాదులు ను ఆయన స్వీకరించారు. కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, ఓటరు జాబితాలో సవరణలు చేయడం వంటివి చేపడుతారని, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పు, చేర్పులు, జాబితాలో చనిపోయిన వారి పేర్లను, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్ళిన వారు పేర్ల తొలగింపు, చిరునామా మార్పు, తప్పులను సరిదిద్దడం వంటివి అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో టెక్కలి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ, టెక్కలి నియోజకవర్గం కో కన్వీనర్ నడుపూరు లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి నేతింటి రాజారావు, టెక్కలి మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు ,కోటబొమ్మాళి మండల అధ్యక్షులు బోయిన రమేష్,వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వారంలో అనేక ఎక్సైజ్ కేసులు నమోదు

విశాలాంధ్ర-సోంపేట : నవోదయం 2లో భాగంగా సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గడచిన వారం రోజుల కాలంలో మే 26 నుంచి 31 వరకు అనేక కేసులు నమోదు చేసినట్లు సీఐ కె.బేబీ తెలిపారు. ఆరు నాటుసారా కేసులు నమోదు చేసి 104 లీటర్ల నాటుసారాయిని, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న 12 మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే 26 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులను పొందాలి

విశాలాంధ్ర-కవిటి: కౌలు రైతులందరూ గుర్తింపు కార్డులను పొందాలని మండల వ్యవసాయ అధికారిణి పి.శ్రీదేవి అన్నారు. ఈ మేరకు శనివారం బల్లిపుట్టుగ గ్రామంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కౌలు రైతులు తహసీల్దార్ ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని, గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. దీని వలన బ్యాంకు రుణాలు, ఇన్సూరెన్స్ వంటివి కౌలు రైతులకే వర్తిస్తాయని తెలిపారు. దీని వలన భూయజమాని హక్కులకు ఎటువంటి భంగం ఉండదని వివరించారు. ఈ కార్యక్రమంలో కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎమ్మెల్యే, ఎంపీలు

విశాలాంధ్ర-రణస్థలం : మండలంలో బంటుపల్లి గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమంలో భాగంగా, ప్రిన్సిపల్ సెక్రటరీ (పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్) శశిభూషన్‌కుమార్ ఐఏఎస్ పింఛన్ పంపిణీ వెరిఫికేషన్‌లో భాగంగా, స్థానిక శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితర ప్రభుత్వ అధికారులు, బంటుపల్లి సర్పంచ్ రజనీ(ఎన్‌ఈఆర్), ఎచ్చెర్ల నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామం ప్రజలు పాల్గొన్నారు. అనంతరం 49వ రోజు పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తితో 49వ రోజు మొక్కలు నాటారు.

ఏయూ నుంచి మాలతికి డాక్టరేట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ప్రివలెన్స్ యాండ్ టాక్సోనమీ ఆఫ్ గ్యాస్ట్రోయిన్టెస్టినల్ హెల్మిన్తే పారాసైట్స్ ఆఫ్ డొమిస్టిక్ రొమినెంట్స్ ఫ్రమ్ విశాఖపట్నం అండ్ శ్రీకాకుళం అనే అంశంపై ఆంధ్రాయూనివర్సిటీ (విశాఖపట్నం)లో జంతు శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని సనపల మాలతి డాక్టరేట్ సాధించారు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఈమె ఏయూ ప్రొఫెసర్ యు. షమీమ్ పర్యవేక్షణలో పరిశోధన జరిపారు. ఆవులు, గేదెలు, మేకలు నుంచి సేకరించిన గ్యాస్ట్రో ఇంటెస్టివల్ హెల్మిన్తే పరాన్నజీవి వ్యాధుల ప్రాబల్యాన్ని, పదనిర్మాణ, వర్గీకరణపై ఈమె పరిశోధించారు. ఈ అధ్యయనంలో గ్యాస్ట్రోయి న్టెస్టినల్ హెల్మిన్తే పరాన్నజీవుల తీవ్రతను తగ్గింపునకు రైతులతో చక్కటి సమన్వయంతో, నిరంతర పారిశుధ్య పర్యవేక్షణను అవ లుచేయాలని సిఫార్సుచేశారు. ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ఈమెకు పీహెచ్‌డిని అందజేశారు.

సత్తా చాటిన వెంకటసాయి విద్యా సంస్థలు

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలో శ్రీ శ్రీ శ్రీ వెంకటసాయి విద్యా సంస్థలంటే ఓ ప్రత్యేకత వుంది. పదవతరగతి, ఇంటర్మీడియట్ లోనే కాకుండా ఇతర పోటీ పరీక్షలలోనూ ఎప్పటికప్పుడు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ... మండలంలోనే ఉత్తమ విద్యా సంస్థగా పేరొందింది. వెంకట సాయి విద్యాసంస్థ. ఇటీవలే విడుదలైన సైనిక్ స్కూల్ పరీక్ష ఫలితలలో లోను కె. మేఘ చరణ్ అనే విద్యార్థి తొమ్మిదవ తరగతికి ఎంపిక కావటం హర్షనీయం. శ్రీ వెంకట సాయి విద్యాసంస్థల చైర్మన్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు మరియు ఉపాధ్యాయులు మేఘ చరణ్‌కు అభినందనలు తెలియజేశారు.

నేడు ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రారంభం..

- డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ..!

- డీలర్ల వ్యవస్థకు ప్రజలు ఆదరిస్తారా..?

విశాలాంధ్ర-పలాస/మందస : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రేషన్ డిపో డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించడంతో ప్రజల్లో అనుకూల, ప్రతికూల చర్చలు సాగుతున్నాయి. ఎం.డి.యు వాహనాలు ద్వారా సరుకులు పంపిణీకి అలవాటు పడిన వినియోగదారులు డీలరు వ్యవస్థకు ఆదరిస్తారో.. లేదో.. భవిష్యత్తులో ఈ సమస్య తేలాల్సి ఉంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఎండియు వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని వినియోగదారులకు ప్రతి నెల నిత్యవసర సరుకులు పంపిణీ జరిగేది. ఎండియు వ్యవస్థలో భాగంగా వాహనాలు కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి ఆపరేటర్లు రుణాలు తీసుకున్నారు. ప్రతి నెల వాయిదాల పద్ధతితో బ్యాంకులకు వాహనాల బకాయిలను చెల్లిస్తుంటారు. బ్యాంకులకు 2027 సంవత్సరం వరకు ఎండియు వాహనాలు పొందిన యజమానులు బ్యాంకులకు రుణ బకాయలు చెల్లించాలి. ప్రస్తుతం ఎండియు వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఎండియు వాహనాల యజమానులైన ఆపరేటర్లు నెలవారి ప్రభుత్వం నుంచి ఆదాయాన్ని కోల్పోవడంతో వీరు ఆందోళన చెందుతున్నారు. తమ కుటుంబాల జీవనోపాధికి కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం ఎండియు వాహనాలు ఆపరేటర్లు, వాలంటీర్లు సహకారంతో నేరుగా గ్రామాల్లో నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సరఫరాలో రేషన్ డిపో డీలర్లకు సంబంధం లేకపోయినా డీలర్లు సరుకుల కోసం డీడీలు చెల్లించి సరుకులను విడిపించి ఎండియు వాహనాల ఆపరేటర్లకు వినియోగదారులకు ఇవ్వాల్సిన సరుకులను అందజేసేవారు. నిత్యవసర సరుకులకు సంబంధించి ప్రభుత్వం డీలర్లకు కమిషన్ ను నెలవారి చెల్లించింది. గత ఐదేళ్ల వైసిపి పాలన ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఇప్పటి వరకు సాగిన ఎండియు వాహన వ్యవస్థ ద్వారా బియ్యం తూనికలో మోసం జరిగింది. ఎండియు వాహనం ఆపరేటర్ తన సొంత గోనె సంచి ద్వారా బియ్యాన్ని తూనికల యంత్రం ద్వారా వినియోగదారులకు ఇచ్చేవారు. దీనివల్ల ఒక్కొక్క వినియోదారునికి 500 గ్రాముల నుంచి 750 గ్రాముల వరకు బియ్యం తరుగు ఉండేది. పౌర సరఫరాల శాఖ గోడౌన్ నుంచి రేషన్ డిపో డీలర్ సరుకులు విడిపించేటప్పుడు ఒక్కొక్క బియ్యం బస్తా లో ఏడు నుంచి 10 కిలోల బియ్యం తరుగు ఉండేది. దీంతో డీలర్లు వినియోగదారులు రేషన్ బియ్యం పంపిణీలో కోతతో తీవ్రంగా నష్టపోయారు. పౌర సరఫరా శాఖ అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల వ్యవస్థను పునరుద్ధరించి పాత విధానాన్ని అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమల్లోకి వచ్చిన డీలర్ వ్యవస్థలో డీలరు ఏర్పాటు చేసుకున్న రేషన్ డిపోలకు వెళ్లి వినియోగదారులు నిత్యవసర సరుకులు తీసుకోవాలి. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేస్తారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు డిపోలు తెరవాలని ప్రభుత్వ మార్గదర్శకాలు జారీ అయ్యాయి. గత వైసిపి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు చేసే విధానానికి అలవాటుపడ్డ వినియోగదారులు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ పంపిణీ విధానానికి వ్యత్యాసం ఉండడంతో ప్రజలు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి మరి.నడవలేని దివ్యాంగులకు 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు రేషన్ డిపో డీలర్లే నేరుగా వారి ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేయాలన్న నిబంధనలు ప్రభుత్వం డీలర్లకు పెట్టింది.అయితే డీలర్లు దూర ప్రాంతాల్లో ఉన్న వీరు ఇళ్ల కు సరుకులు తీసుకుని వెళ్లి ఇస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. డీలర్లే సొంత ఖర్చులు పెట్టుకుని వాహనాలపై సరుకులు పట్టుకుని వీరికి ఇవ్వాలన్న నిబంధనలు పెడుతూ సూచించింది. అంతే కాకుండా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచం పట్టిన వ్యాధిగ్రస్తులకు కూడా డీలర్లే నేరుగా సరుకులు అందజేస్తారో లేదో వేచి చూడాలి అని ప్రజలు అంటున్నారు. ఇకపోతే గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఎండియు వాహనాల ఆపరేటర్లకు కంప్యూటర్ తూనికలు కొలతలు సామగ్రిని అందించింది. ప్రస్తుతం రేషన్ డిపో డీలర్ వ్యవస్థ ప్రభుత్వం అమలు చేసినప్పటికీ తూనికలు కొలతలు యంత్రాలు డీలర్లే సమకూర్చుకుంటున్నారు. అయితే డీలర్లు ఏర్పాటు చేసుకుంటున్నా ఈ యంత్రాల్లో అవకతవకులు ఉంటాయని ప్రజలు అనుమానిస్తున్నారు. పాత మిషన్లు సరుకులు కొలతల కోసం వినియోగించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని, ప్రతి రేషన్ డిపోలో తూనికలు కొలతలు శాఖ స్టాంపింగ్ రసీదులు తప్పని సరిగా ఉండాలని సివిల్ సప్లై శాఖ నిబంధనలు ఉన్నప్పటికీ ఇవి డిపోల్లో అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు.

రేషన్ డిపో డీలర్ల వ్యవస్థకు ప్రత్యేక చరిత్ర : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భావం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సమితి కేంద్రంలోనూ, తహసిల్దార్ కార్యాలయాలు ఉండే తాలూకా కేంద్రాల్లోనూ సూపర్ బజార్లు ఉండేవి. ఈ సూపర్ బజార్ల ద్వారా ప్రజలు కావలసిన నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకునేవారు. ఆ తరువాత 1983 సంవత్సరంలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రేషన్ డిపో డీలర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. అప్పటి జనాభా ప్రాతిపదిక రేషన్ డిపోలు ఏర్పాటు చేసి రేషన్ డిపో డీలర్ల నియమాకాలను చేపట్టింది. అప్పటి నుంచి 2018 సంవత్సరం వరకు సుమారు 35 సంవత్సరాలు పాటు రేషన్ డిపో డీలర్ల వ్యవస్థ గ్రామాల్లో కొనసాగింది. 2019 సంవత్సరంలో గత వైసిపి ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా డీలర్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు ప్రజలకు పంపిణీ చేసే విధానానికి స్వస్తి పలికింది. డీలర్లకు నెలవారి ప్రభుత్వం కమిషన్ చెల్లిస్తూ ఎండియు వాహనాల ద్వారా గ్రామాల్లో ప్రజా పంపిణీ వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. సుమారు గత ఆరు సంవత్సరాలుగా ఈ వ్యవస్థ కొనసాగుతుంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం పాత డీలరు వ్యవస్థను పునరుద్ధరించడంతో రేషన్ డిపో డీలర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : పంచాయతీ కార్యదర్శి శ్వేత

విశాలాంధ్ర-కవిటి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పంచాయతీ కార్యదర్శి బూరగాపు శ్వేత అన్నారు. ఈ మేరకు ఆదివారం బి గొనపపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి జిల్లా క్రీడా అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఐదు బాల్స్, ఒక నెట్టును అందజేసినట్లు శిక్షకులు బల్లెడ రమేష్ తెలియజేశారు. ఈ మేరకు క్రీడ విద్యార్థులను ఉద్దేశించి శ్వేత మాట్లాడుతూ ప్రతిరోజు మీరు చేసినటువంటి ఫిట్నెస్, ఎంచుకున్న క్రీడ మీ జీవితం లో ఎంతగానో ఉపయోగపడతాయని వాటిని ప్రొఫెషనల్‌గా అవలంబించాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ మూడు శాతం రిజర్వేషన్ కల్పన వల్ల అనేక ఉద్యోగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అవకాశం కల్పిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ యోగ కార్యక్రమాల్లో పాల్గొని మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని మాణిక్యపురం ఫీడరునందు 11 కేవీలో ఆర్డీఎస్ఎస్ పనులు నిమిత్తం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్ శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు,వ్యవసాయ కనెక్షన్ పొందిన రైతులు సహకరించాలని కోరారు.

పిడుగుపాటుకు బూరాడ అప్పలనాయుడు మృతి

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలోని చిన్నకాగితపెల్లి పంచాయతీ బుడ్డీవలస గ్రామానికి చెందిన బూరాడ అప్పలనాయుడు శనివారం సాయంత్రం పిడుగుపాటుకి మరణించారు. బూరాడ అప్పలనాయుడు వయసు 55 పొలంలో గట్టులు వేస్తుండగా పిడుగు పడిందని వెంటనే పెద్దకేక వేస్తు అక్కడే కుప్పకులారని సమీపంలో పని చేస్తున్న రైతు వాడవలస వాసుదేవరావు చూసి గ్రామస్తులకు తెలియపరిచారని, గ్రామస్తులు హుటా హుటిన సరుబుజ్జిలి ప్రాథమిక వైద్యసాలకు తరలించిగా అప్పంటికే మరణించి నట్లు వైద్యులు ధ్రువకిరించారాని అప్పలనాయుడు భార్య సావిత్రమ్మ ఇచ్చిన సమాచారం ప్రకారం కేసు నమోదు చేసినట్లు సరుబుజ్జిలి ఎస్ ఐ బి. హైమవతి తెలియపరిచారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ కి తరిలించామని అన్నారు.

విభాగాల సమన్వయంతోనే ఉత్తమ ఫలితాలు

– జిల్లాల మధ్య పోటీ పెరిగింది

– జిల్లా ప్రత్యేక అధికారి శశిభూషణ్ కుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రస్తుతం జిల్లాల మధ్య కేవలం సహకారం మాత్రమే కాకుండా, అభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ కూడా పెరిగిందని శ్రీకాకుళం జిల్లా ప్రత్యేక అధికారి, పీఆర్, ఆర్డబ్ల్యుఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తలసరి ఆదాయం, జీడీపీ వృద్ధి వంటి కీలక సూచికలలో శ్రీకాకుళం జిల్లా గణనీయంగా పురోగమిస్తోందని వెల్లడించారు. "కాలం చాలా వేగంగా మారిపోతోంది. ప్రతి జిల్లా తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలి. ముఖ్యమంత్రి కలెక్టర్ల కాన్ఫరెన్స్ తర్వాత మీ ప్రగతి స్పష్టంగా కనిపిస్తోంది," అని శశిభూషణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయ దాని అనుబంధ రంగాలకు ప్రోత్సాహం, విపత్తుల నిర్వహణలో ముందస్తు ప్రణాళికలు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే శ్రీకాకుళం జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందంజలో నిలుపుతామని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, విపత్తు నిర్వహణపై ప్రత్యేక దృష్టి... సమీక్షలో భాగంగా, 'యోగాంధ్ర 2025', 'స్వర్ణ ఆంధ్ర', 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలతో పాటు, విపత్తులపై తక్షణ స్పందన, పింఛన్ల పంపిణీ, వ్యర్థాల నిర్వహణ వంటి కీలక అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. పింఛన్ల పంపిణీలో ప్రజల నుంచి ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నామని, డోర్-టు-డోర్ సేవలతో ఈ వ్యవస్థ మరింత సమర్థవంతంగా అమలవుతోందని శశిభూషణ్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఏటా తుఫానులకు గురవుతుందని గుర్తుచేస్తూ, విపత్తులను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగావళి, వంశధార నదులపై కరకట్టలను పర్యవేక్షించాలని, నిరంతరం మానిటరింగ్ చేయాలని సూచించారు. రాబోయే నైరుతి రుతుపవనాల కోసం అన్ని శాఖలు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి... జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు పంట వైవిధ్యాన్ని, డ్రోన్ సాంకేతికత వినియోగాన్ని సమీక్షించారు. ఇప్పటికే 21,000 హెక్టార్లలో డ్రోన్ స్ప్రేయింగ్ జరిగిందని, ఈ ఏడాది దీనిని 42,000 హెక్టార్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆయిల్ పామ్, కూరగాయల సాగు విస్తరణ ద్వారా ఉద్యానవన వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

మత్స్య, పశుసంవర్ధక రంగాలకు ప్రణాళికలు...

పాడి అభివృద్ధికి గోకులాల ఏర్పాటు, పరిపుష్టాహార పంపిణీ, సెక్స్ సార్టెడ్ సీమెన్ ద్వారా ఆడ దూడల ఉత్పత్తిని ప్రోత్సహించడం, జూన్ నుండి డిసెంబర్ వరకు ఆయిల్ పామ్ సాగు ద్వారా రూ.98 కోట్ల విలువైన వృద్ధిని అంచనా వేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ-వేస్ట్ అవగాహన, డిజిటల్ మానిటరింగ్ బారువ బీచ్ ఫెస్టివల్‌లో ఈ-వేస్ట్ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించామని అధికారులు తెలిపారు. 81 శాఖల ద్వారా డిజిటల్ మానిటరింగ్ జరుగుతుందని, విపత్తుల సమాచారాన్ని స్థానిక ప్రజలకు టామ్ .. టామ్ ద్వారా వేగంగా చేరవేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమీక్షా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సహా జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, వెంకటేష్, డిఆర్డిఏ పీడీ కిరణ్ కుమార్, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఐసిడిఎస్ పీడీ శాంతి శ్రీ, డిఎంహెచ్ఓ అనిత, డిటిసి విజయసారథి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంచమ్మతల్లి సంబరాలు

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి గ్రామ ఇలవేల్పు, భక్తుల కొంగుబంగారంగా పిలువబడే శ్రీకంచమ్మతల్లి సంబర మహోత్సవాలకు కంచిలి గ్రామం సిద్ధమైంది. మండల కేంద్రమైన కంచిలిలో జూన్ 1నుంచి 10వ తేదీ వరకు పది రోజుల పాటు అమ్మవారి సంబరాలను భారీ ఎత్తున చేపట్టేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. కంచిలి మండల కేంద్రంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలు ఎంతో నమ్మకంగా తమ కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నిత్యం పూజించే కంచమ్మతల్లి జూన్ 1వ తేదీన ఆదివారం సాయంత్రం రైల్వేస్టేషన్ అవతల గ్రామపొలిమేరల నుంచి గ్రామంలోనికి రానున్నది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆహ్వానించే సమయంలో మేళతాళాలతో భారీ బాణాసంచా కాల్పులతో అమ్మవారిని ఆహ్వానించనున్నారు. ఈ ఘట్టం తిలకించేందుకు తొలిరోజున పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. మొత్తం 10 రోజులు జరిగే సంబరాలకు సుమారు 5లక్షల మంది హాజరవుతారని అంచనా. ఉత్సవాల్లో భాగంగా కంచిలి మెయిన్‌రోడ్డు అనగా జాతీయ రహదారి పక్కనున్న కేశవయ్య దాబా నుంచి మఠం కంచిలి వరకు అలాగే అన్ని వీధుల్లోను విద్యుత్ అలంకరణలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుత్ అలంకరణలతో ఇప్పటికే ముస్తాబులు పూర్తయ్యాయి. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం కానున్నది. అలాగే జాతీయరహదారికి ఆనుకుని ఉన్న కంచిలి లోపలకు వెళ్లే రోడ్ల వద్ద విద్యుత్ ముఖద్వారాలు ఏర్పాటు చేశారు. పదేళ్ల తర్వాత జరగనున్న ఈ సంబర మహోత్సవాలను ఎంతో ఘనంగా అందరినీ ఆకట్టుకునేలా నిర్వహించేందుకు గ్రామంలో గల ప్రతినిధులతో కూడిన కమిటీ గత కొద్ది నెలలుగా నిర్వహణ ఏర్పాట్లు ప్రారంభించింది. ఆలయం నుంచి నేరగా గ్రామంలోపలకి కంచమ్మతల్లి విచ్చేసి భక్తజనుల మధ్యలో పది రోజుల పాటు సంచరించి ప్రజల కోర్కెలు తీర్చేందుకు విచ్చేయనుండడంతో భక్తుల్లో ఎంతో ఆనందం వెల్లి విరుస్తోంది. సుమారు రెండున్నర కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ సంబర మహోత్సవాలను గ్రామస్తులు ఐక్యంగా నిర్వహిస్తున్నారు. సంబరాల దృష్ట్యా ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి కంచిలి మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ నిలిపి వేయనున్నారు. రాకపోకలు సాగించే వారు కంచిలి బైపాస్ నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. అలాగే అన్ని వైపులా వాహనాల పార్కింగ్ కోసం సరైన ఏర్పాట్లు చేపట్టారు.

పేదలకు వైద్య సేవలు అందించడం అభినందనీయం

మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యం లో ఉచిత వైద్య శిబిరం



విశాలాంధ్ర-ఆమదాలవలస: మెండ విమలమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా పేదలకు వైద్య సేవలు అందించడం ఎంతో అభినందనీయమని పాలకొండ సబ్ ఇన్స్పెక్టర్ జీవీ రమణ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో చిట్టెమ్మ క్వాటర్స్ లో ఉన్న మెండ విమలమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో జేమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్సై రమణ, కోరమండల్ ఫర్టిలైజర్ మేనేజర్ పృథ్వీలాల్ బెహరా ప్రారంభించారు. అంద రికీ ఆరోగ్యం అందించడానికి ప్రతి ఏడాది ఈ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత సాధారణ వ్యాధులు, కంటి వ్యాధుల వైద్య శిబిరం, షుగర్ వ్యాధులపై, కె. వి. వి.డెంటల్ హాస్పిటల్, ఉచి త దంత వైద్య శిబిరాలు నిర్వహించడంతో వందమం ది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేమ్స్ వైద్యు లు వివేక్, ఈశ్వరరావు, పిఆర్వో త్రినాధరావు, అసి స్టెంట్ మేనేజర్ రాజేశ్వరరావు, సంస్థ అధ్యక్షులు మెండ శ్రీనివాస్ రావు, సెక్రటరీ శంకర్ ప్రసాద్, పాస్టర్లు శ్యాం, జార్జ్ ముల్లర్, ఆశీరకుమార్, పాల్, కృపరావ్ మాస్టర్, అశోక్, రమణ, కుటుంబ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యంకనంలో కూటమి ప్రభుత్వం విఫలం!



విశాలాంధ్ర-పలాస: రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షల మూల్యంకనం సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలం అయిందని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం పలాస నియోజకవర్గం అధ్యక్షులు బమ్మిడి సంతోష్ కుమార్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని ఆరోపించారు. 10వ తరగతి ఆఫ్ ఇయర్లీ పరీక్షలు నుంచి పబ్లిక్ పరీక్షలు వరకు పేపర్ లీకేజీ జరిగాయని, జవాబు పత్రాలు మూల్యాంకనంలోనూ ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తొలిసారి 22 రోజుల్లోనే టెన్త్ మూల్యాకనం పూర్తి చేశామని కూటమి ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుందని, తప్పులు తడకలుగా మూల్యాంకనం చేసి 1,15,774 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు ఫలితాలు ప్రకటించారన్నారు. వారిలో 66,363 మంది పేపర్ లను రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ తర్వాత దాదాపు 11,000 మంది ఉత్తీర్ణులైనట్లు ఎస్ఎస్ సి బోర్డు ప్రకటించిందన్నారు. ఇదంతా చూస్తుంటే మూల్యాంకనం ఎంత లోపభీష్టంగా జరిగిందో స్పష్టమవుతుందని, మూల్యంకనంలో ఉపాధ్యాయులకు టార్గెట్లు పెట్టి వేధించి విద్యార్థుల జీవితాలతో ఈ ప్రభుత్వం ఆడుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఉపాధ్యాయులను దోషులుగా చూపించి సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకోవడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. మంత్రి లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని బమ్మిడి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు.

తహసిల్దార్ కార్యాలయం సమీపంలో పలాస కోర్టు

విశాలాంధ్ర-పలాస: పలాస సివిల్ జడ్జి కోర్టు నూతన భవనాలు నిర్మాణం అయ్యేంతవరకు పలాస తహసిల్దార్ కార్యాలయం సమీపంలో గల పాత ఎస్ఎఫ్ఎస్ పాఠశాల భవనాల ఆవరణలో నిర్వహిస్తున్నామని, అధికారులు, కక్షిదారులు ఈ మార్పును గమనించాలని పలాస మండల న్యాయ సేవా సంఘం అధికారి మరియు జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి తెలిపారు. శనివారం నూతన అద్దె భవనంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకమైన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి యు.మాధురి మాట్లాడుతూ జూలై 5న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా ప్రతీ కార్యాలయంలో మహిళల రక్షణ కొరకు ఇంటర్నల్ కమిటీ వేయాలని ఎవరైనా మహిళలు వేధింపులు గురైనట్లయితే వారు ఆ కమిటీకి తెలియజేసి తప్పు చేసిన వాడికి శిక్ష పడేలా చూడవచ్చునని తెలిపారు. అలాగే పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎక్కడైనా అనాధ పిల్లలు లేదా వదిలివేయబడ్డ పిల్లలు ఉంటే వారిని గుర్తించి వారందరికీ ఆధార్ కార్డు అందజేయాలని రాష్ట్ర న్యాయ సంఘం సంస్థ వారు సాధి అనే పదకం ద్వారా ఆదేశించారన్నారు. రాష్ట్ర న్యాయ సంఘం ఆదేశాల మేరకు త్వరలో అన్ని డిపార్ట్మెంట్లతో కలిసి వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్టు జూనియర్ సివిల్ జడ్జ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్(గని) ఉపాధ్యక్షులు బి కేర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జి ఎం ఎస్ అనిల్ రాజ్,ఏ జి పి పిండి వెంకట్రావు, పైల రాజరత్నం నాయుడు, తాండ్ర మురళి,విగ్నేష్, రవికుమార్, చంద్రశేఖర రావు , సుధారాణి రవి పట్నాయక్, చిట్టిబాబు లోకేష్,తహసీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో వసంతరావు, డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠ రావు, ఎంఈఓ శ్రీనివాస్,, ఐసిడిఎస్ సూపర్వైజర్ యు లత, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, వజ్రపుకొత్తూరు ఎస్సై నిహార్, కోర్టు సూపరింటెండెంట్ కృష్ణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు జి శాంతమ్మ, కార్యదర్శి కంచరాన పార్వతి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అహల్యభాయ్ హెూల్కర్ జయంతి



విశాలాంధ్ర-మందస: మరాఠీ మహారాణి అహల్యాబాయ్ హెూల్కర్ 300 వ జయంతి సందర్భంగా శనివారం మందస భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి మండల అధ్యక్షులు తెలుపుల సురేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు కృష్ణ మోహన్ మాట్లాడుతూ దేశ భక్తురాలైన అహల్యాబాయి దానశీలత్వం,హిందుత్వ అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర జోనల్ ఇన్చార్జ్ రౌతు చిరంజీవి రావు, మందస పట్టణ అధ్యక్షులు గౌడ్ హడ్డి, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఇప్పిలి వెంకట్రావు, మరియు బిజెపి అభిమానులు సానుభూతిపరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం సెట్ శ్రీ సిఇఓ ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: యోగా ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుందని సెట్ శ్రీ సిఇఓ ప్రసాదరావు తెలిపారు. శనివారం శ్రీకాకుళం స్టేడియంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రోజు మనం ఇంటి వద్దే యోగా చేసుకోవచ్చున్నారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సాధించవచ్చునని చెప్పారు. అన్ని వయసులవారూ యోగా చేయొచ్చునన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని పిలుపునిచ్చారు. యోగా టీచర్లు పాంచ్రంకి మురళి కృష్ణ, తంగి స్వాతి యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అధికారి నారాయణరావు, యువజన సర్వీసులు శాఖ అధికారి ఉజ్వల్, డియస్డీఓ శ్రీధర్, సెట్ శ్రీ సిఇఓ కార్యాలయం మేనేజర్ రామారావు, కార్యాలయ సిబ్బంది, యోగా శిక్షకులు మురళీకృష్ణ, తంగి స్వాతి, ఆయుష్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమం...

విశాలాంధ్ర-హిరమండలం: యోగాంధ్ర 2025 వేడుకల సన్నాహాల్లో భాగంగా శనివారం హిర మండలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణములో ఒక ప్రత్యేక యోగసన ప్రదర్శన కార్యక్రమం జరిగింది. మొత్తం గా 70 మంది యువత ఉత్సాహం గా పాల్గొన్నారు. ఈ ప్రదర్శన లో వివిధ రకాల యోగసనాలను సమర్దవంతం గా ప్రదర్శించి వారి శారీరక దృఢత్వాన్ని చాటారు, ఈ యోగాంధ్ర కార్యక్రమం లో ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు, తహసీల్దార్ ఎన్ హనుమంత్ రావు, మండలవిద్యా శాఖాది కారి కే రాంబాబు, హెూసింగ్ ఏ ఈ ఏ మాధవ్ రావు, ఈఓ టి హరికృష్ణ, ఆర్ ఐ ఉమా శంకర్ పంచాయతీ సిబ్బంది రెవిన్యూ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించేందుకే ప్రత్యేక సమావేశాలు : ఏవో సురేష్

విశాలాంధ్ర-జలుమూరు : గ్రామస్థాయిలో కౌలు రైతులను గుర్తించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ సంయుక్తంగా గ్రామాల్లో ఈ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిందని జలుమూరు మండల వ్యవసాయ అధికారి కొంక్యాన సురేష్ అన్నారు. శనివారం జలుమూరు మండలం శ్రీముఖలింగం నగరికటకం, మర్రివలస రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు హక్కు పత్రాలు పిసిఆర్సి యొక్క ఉపయోగాలు గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. కవులు చేస్తున్నటువంటి రైతులు అందరూ పంట సాగు హక్కు పత్రాలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన రైతులకు తెలియజేశారు. ఈ పంట నమోదు కొరకు ధాన్యం మద్దతు ధర పొందడానికి గాను ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి బ్యాంకు నందు పంటలను పొందడానికి కౌలు రైతులను గ్రూపుగా ఏర్పాటు చేసి పంటలను పొందవచ్చని అన్నారు. అన్నదాత సుఖీభవ పొందడానికి కూడా ఈ కార్డు ఉపయోగపడుతుందని పకృతివైపరీత్యాలు సంభవించినప్పుడు ఇన్పుట్ సబ్సిడీ ఇన్సూరెన్స్ వంటివి పొందడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఆయనతోపాటు మర్రివలస సర్పంచ్ బగ్గు గోవిందరావు పలువురు ప్రజా ప్రతినిధులు గ్రామ రెవెన్యూ అధికారి గోపి వి ఏ ఏ శ్రావణి రైతులు పాల్గొన్నారు.

తీర గ్రామాల్లో అవగాహన సదస్సులు



విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని కొత్తదిబ్బలపాలెం, పాతదిబ్బలపాలెం గ్రామాల్లో కళింగపట్నం కోస్టర్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. హరికృష్ణ శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు. చేపల వేటకు వెళ్లేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై వ త్స్యకారులకు వివరించారు. అపరిచిత, అనుమానస్పద వ్యక్తులు కన్పించినా, ఎవరైనా నిషేధం వస్తువుల అక్రమ రవాణా చేసినా వెంటనే మెరైన్, స్థానిక పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించాలన్నారు. టోల్ ఫ్రీ నెంబరు 1093, 93929 14712కు తెలియజేయాలన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఢిల్లీ మాస్టర్

విశాలాంధ్ర-పలాస: ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్ళుగా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మాస్టర్ లఖినాన డిల్లేశ్వరరావు అని పలాస మండల విద్యాశాఖాధికారులు సిహెచ్. శ్రీనివాసరావు, చెరుకుపల్లి సత్యంలు అన్నారు.శనివారం కాశీబుగ్గ పద్మనాభపురం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లఖినాన డిల్లేశ్వరరావు ఉద్యోగ విరమణ చేపట్టిన సందర్భంగా డిల్లేశ్వరరావు, పద్మ దంపతులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి డిల్లేశ్వరరావు మాస్టర్ అని కొనియాడారు. ఏ పాఠశాలలో పని చేసిన అంకిత భావంతో పని చేసేవారని, ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమని విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపుగా నిలుస్తాయని అన్నారు. అనంతరం లఖినాన డిల్లేశ్వరరావు మాట్లాడుతూ తాను ఉద్యోగ విరమణ చేసిన విద్యార్థులకు తన వంతుగా విద్యను అందించి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా యూటిఎఫ్ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో గున్న మధుసూదనరావు, కంచరాన ప్రసాదరావు, గుంట కోదండరావు, బల్ల చిట్టి బాబు, కంచరాన జయరాం, కంచరాన రమేష్, గొర్రెల నాగేశ్వరరావు, చందు, బెండి లక్ష్మి, గొండు మధు, ఎస్ వెంకటరమణ, పురుషోత్తం, భానుమతి, మెట్ట మోహనరావు ఎస్ వి పట్నాయక్, విద్యా కమిటీ చైర్మన్ కొండాల సుధా, వైస్ చైర్మన్ మోహర్తదితరులు బాబా, విద్యార్థుల తలిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా శ్రీ ఉమా పాలేశ్వర స్వామి కళ్యాణం



విశాలాంధ్ర-సంతబొమ్మాళి: మండల కేంద్రంలో సంతబొమ్మాళి లో వెలసిన శ్రీ ఉమా పాలేశ్వర స్వామి కళ్యాణం శనివారం కన్నుల పండుగగా జరిగింది. గ్రామ పురోహితులు ఆధ్వర్యంలో ప్రతి ఏటా అత్యంత వైవభంగా నిర్వహిస్తారు.ఆలయ కమిటీ సభ్యులు ముందు రోజు పాలేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను సంతబొమ్మాళి గ్రామంలో తిరువీధి నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమై, ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం వేద పండితులు కోటి గురు స్వామి ఆధ్వర్యంలో ఉమా పాలేశ్వరుని కళ్యాణం భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు.స్వామి వారి కళ్యాణం లో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి,నగిరి పెంట, తెనిగిపెంట, అంట్ల వరం, తాళ్ల వలస గ్రామాల నుంచి భక్తులు ఎక్కువగా పాల్గొని తరించారు. ఆలయ కమిటీ సభ్యులు వందలాది మంది భక్తులు కోసం ప్రసాదం ఏర్పాటు చేశారు.

అంగరంగ వైభవంగా ఎండల మల్లికార్జున స్వామి కళ్యాణ మహోమత్సవం

విశాలాంధ్ర-టెక్కలి: మండలంలోని రావివలస గ్రామంలో వెలిసిన మహా పుణ్యక్షేత్రం అయినా శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి జి గురునాథరావు ఆధ్వర్యంలో ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని మురాటలతో కోలాట నృత్య ప్రదర్శనతో అట్టహాసంగా తిరువీధి మహోత్సవం కనుల విందుగా జరిపారు. ఎండల మల్లన్నకు ప్రత్యేక అభిషేకాలు దీపధూపాలతో భక్తులు పూజలు చేశారు. అనంతరం మహా ప్రసాదం అయినా అన్నదానం వితరణ కార్యక్రమం నిర్వహించి, శివుడు పార్వతుల విగ్రహాలకు దంపతులచే కళ్యాణాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు, దేవాదాయ శాఖ సిబ్బంది, పండితులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర-టెక్కలి : మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉన్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో 1వ తేదీ నుండి 31వ తేదీ వరకూ రిటైర్డ్.వ్యాయామ ఉపాధ్యాయులు కే రఘునాథరావు ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగియనున్నట్లు తెలిపారు. అయితే ఈ నెలరోజుల పాటు అథ్లెటిక్స్ లో భాగమైన పరుగు పందాలు,హై జంప్, లాంగ్ జంప్, మైనర్ ఆటలు పై క్రీడాకారులకు శిక్షణ అందించినట్లు వివరించారు. శనివారంతో ముగియనున్న సందర్భంగా ఆఖరిగా యోగ ఆసనాలతో ఈ వేసవి శిక్షణ శిబిరం ముగింపు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి నారాయణరావు, కేకే రామిరెడ్డి, ఎస్ లక్ష్మణరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారు

విశాలాంధ్ర-కవిటి: ఉపాధ్యాయ వృత్తిలో 25 ఏళ్లుగా సేవలందిస్తూ క్రమశిక్షణ, సమయపాలన, విద్యార్థులను ఆకట్టుకునే బోధనతో ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని సీనియర్ ఉపాధ్యాయులు జన్నెల శంకరరావు అన్నారు.ఆర్.బల్లిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా సేవలందించి నేడు పదవీ విరమణ చేసిన సుంకర వెంకటరావు దంపతులకు కవిటి మండల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.లక్ష్మణమూర్తి, ఎం.గోపి, కె.రంగారావు, బి.ధర్మారావు, జి.జానకిరావు, ఎం. డిల్లేశ్వరరావు, ఎ.హిమకుమార్, ఎల్.మురళీధర్, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి తోనే సమాజాభివృద్ధి

– సత్య సాయి సంస్థల జిల్లా అధ్యక్షులు రామచంద్ర రావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : వ్యక్తి నైపుణ్య అభివృద్ధి చెందితే వారు సమాజానికి మేలు చేస్తారు అని సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సూర రామచంద్ర రావు అన్నారు. శని వారం సాయంత్రం ఆమదాలవలస పట్టణం లో లక్ష్మి నగర్ భజన మండలి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో గత 45 రోజులు గా శిక్షణ పొందుతున్న కంప్యూటర్ విద్యార్థులు, సంగీత శిక్షణ మరియు టైలరింగ్ పొందుతున్న సుమారు 72 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశా రు. జోనల్ కన్వీనర్ ఎం.జనార్దన్ సాయి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఇంచార్జి బోయిన నరసింహ మూర్తి మాట్లాడుతూ జిల్లా లో సుమారు 5 శాశ్వత స్కిల్ డెవలప్మెంట్ సెం టర్ల లో లక్ష్మి నగర్ సెంటర్ కూడా ఉండడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. స్థానిక స్కిల్ దెవ లప్మెంట్ సెంటర్ ఇన్చార్జి ఎం. రవీంద్ర బాబు త్వరలో మెట్టక్కి వలస సమితి లో కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం అవుతుందన్నారు. రాష్ట్ర విద్యా జ్యోతి ఇంచార్జి ఎస్.వి.గురు ప్రసాద్ కృషిని వక్తలు అభినందించారు. జిల్లా బాల వికాస్ రిసోర్స్ పర్సన్ లాడె చంద్ర శేఖర్ మాష్టర్ , జిల్లా మెడికల్ ఇంచార్జి డా.పి.తాతయ్య లు, మందిరం కన్వీనర్ ఎస్. వాసు గారు, తమ్మన బంగార్రాజు, ప్రతిమ, శిక్షకులు భార్గవి, జె.వాణి, దామోదర్ పట్నాయక్, త్రినాథ రావు, కె. మ ల్లీశ్వర రావు 82 మంది పిల్లలు పాల్గొన్నారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు



విశాలాంధ్ర-సోంపేట: సోంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గల సుమారు 140 ఆటోలకు శనివారం క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు పోలీసులు అతికించారు. క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల ద్వారా సంబంధిత ఆటో సమాచారంతో పాటు డ్రైవర్ వివరాలు నమోదు చేయబడి ఉంటాయని పేర్కొన్నారు. ప్రయాణీకుల రక్షణ, సౌలభ్యం కోసం ఇటువంటి కార్యక్రమం చేపట్టినట్లు కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మంగరాజు, ఎస్సై లోవరాజు, అప్పలనాయుడు, విజయ్ తెలిపారు.

నేటి నుండి రేషన్ డిపోలో నిత్యవసర సరుకులు సరఫరా తహసిల్దార్ రామారావు

విశాలాంధ్ర-జలుమూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేపటినుండి అనగా జూన్ 1 నుండి ప్రతి రేషన్ డిపోలోనే నిత్యవసర సరుకులు సరఫరా జరుగు తుందని జలుమూరు తాసిల్దార్ జన్ని రామారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు మధ్యాహ్నం 4 నుండి 8 గంటల వరకు డిపోల వద్ద సరఫరా జరుగుతుందని లబ్ధిదారులు ఈ పద్ధతులను అర్థం చేసుకొని ఇకనుండి డిపోల వద్దకే వెళ్లి తీసుకోవాలని ఆయన సూచించారు. నేటి నుండి వాహనాలు ద్వారా సరుకు సరఫరా వాహనాలు రద్దు.

వేసవి విజ్ఞాన శిబిరంలో వివిధ రకాల పోటీలు



విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం సంతబొమ్మాళి మండలం నూపడా శాఖ గ్రంథాలయంలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు డాన్స్ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయంలో గల రామాయణాన్ని విద్యార్థులతో చదివించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎన్ ప్రసాద్, రీడర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీ


పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం:

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల (ఎన్ఎన్ ఆర్ పురం)లో శనివారం జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మోష్ మాట్లాడుతూ పొగాకు వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ప్రజల్లో అవగాహనకు, పొగాకు వ్యతిరేకంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్యంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యన్నారాయ ణ, పెంకి చైతన్యకుమార్, జి.రమణ, ఉమాశంకర్, ఎన్ఎన్ఎన్ ఇన్చార్జి బి. అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వరూప్ కు రాష్ట్రస్థాయి అభినందనీయం : మాజీ డిసిసిబి కరిమి

విశాలాంధ్ర-పోలాకి : మెంటడా స్వరూప్ కు జిల్లా యువజన విభాగం నుండి రాష్ట్రస్థాయి కమిటీలో అవకాశం వైసీపీ అధిష్ఠానం కల్పించడం చాలా సంతోషకరమని జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం సాయంకాలం శ్రీకాకుళంలో డాక్టర్ ఎం వి పద్మావతిని కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా నలుమూలల నుండి వైసిపి నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున అభినందనలు తెలిపారు.

రాయితీ విత్తనాలపై రైతన్న ఎదురుచూపులు!

- బ్లాక్ మార్కెట్లోకి నిల్వలు
- బోసి పోయిన రైతు సేవ కేంద్రాలు
- ఆందోళనలో అన్నదాత
- మిల్లర్ల వత్తిడికి దిగి వచ్చిన ప్రభుత్వం
- ముతక రకం వద్దు సన్నాలు ముద్దు
- ఖరీఫ్ నకు సకాలంలో విత్తనాలు అందేనా...

విశాలాంధ్ర-ఆమదాలవలస : నిరంతరం శ్రమించే రైతన్న మార్గశిర మాసం కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటారు. తొల కరి పలకరించగానే వరి విత్తనాలు జల్లి ఏడాదికి వచ్చే ధాన్యం కోసం ఆరుగాలం కష్ట పడుతుంటాడు. నేనే పద్యంలోని రోహిణి కార్తీ ముగిసేలోగా తన పొలానికి కావలసిన విత్తనాలు ఎరువులు పురుగు మందులు సమ కూర్చుకొనే ఆలోచన చేస్తుంటారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామ సచివాలయాల పరిధిలో రైతు సేవా కేంద్రాలు గత ప్రభుత్వం ఏర్పాటు చేసి అక్కడ నుంచే రైతులకు కావలసిన సరుకులను అందించేవారు. జూన్ నెల ఆరంభ మయినప్పటికీ రైతు సేవా కేంద్రాలు బోసిగా పడి ఉండడంతో సకాలంలో విత్తనాలు అందవేమో అన్న ఆందోళనలో అన్నదాతలు ఉన్నారు. ఇప్పటికే వ్యాపారులు వారి గోదాములలో విత్తనాలను ఎరువు లను నిలువలు వేశారు. గోదాములకు చేరుతున్న వి త్తనాలతో రైతు అవసరాలకు అందించకుండా బ్లాక్ మార్కెట్ విధానాన్ని అవలంబిస్తారన్న భయం రైతు లను వెంటాడుతుంది. రైతులకు మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఉంటుందన్న ఆలోచనతో ఇప్పటి వరకు రైతులు ఉన్నప్పటికీ ప్రైవేటు గోదాముల్లో నిలు వ అవుతున్న విత్తనాలను చూసి అధిక ధరలకు కొన వలసి వస్తుందేమో అని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై అధికారులు గానీ ప్రభుత్వంలోని పెద్ద లు కానీ సమయం ఉందిలే అనడంతో రైతులలో మరింత ఆందోళన పెరుగుతుంది. తొలకరి కి ముందే వరుడు పలకరించడంతో పొలాలు చదును చేసి వరి ఎదలు జల్లేందుకు ఎదురుచూస్తున్నారు.

మిల్లర్ల ఒత్తిడికి దిగి వచ్చిన ప్రభుత్వం... రైతులు పండించే పంటలను గిట్టుబాటు ధరకే కొనుగో లు చేయాలంటే సన్న రకాలు వాడాలని పిల్లర్లు పలు సమావేశాల్లో అధికారుల ముందు స్పష్టం చేయటంతో ఇల్లు అధికారులు అదే బాధపడుతున్నట్లు తెలుస్తుం ది. ఇప్పటికే ఖరీఫ్ సీజన్లో మేలైన విత్తన రకాలు రైతు లు అందించాలని అన్ని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా గ్రామ సభలు నిర్వహించి నేలకు అనువైన రకాన్ని గుర్తించే పనిలో ప్రభుత్వం ఎప్పటికీ గ్రామ సభలు నిర్వహిస్తోంది. ఎంటియు, 12 24, బి పి టి 52 0 4 సాంబ రకం, బిపిటి 32 91 సోనా మసూరి రకాలు, ఆర్ జె ఎల్ 25 37 సి ఆర్ రకం మాత్రమే వినియో గిస్తే అధిక దిగుబడులతోపాటు గిట్టుబాటు ధర వస్తుందని రైతులకు వివరించడంలో శాస్త్రవేత్తలు నిమగ్నమై ఉన్నారు. ముతకరకాలను వినియోగించ డం వల్ల ఎఫ్ సి ఐ కొనుగోలులో ఆలస్యం అవుతుం దని అంతేకాకుండా తగిన గిట్టుబాటు ధర ఉండదని రైతులకు నచ్చ చెబుతున్నారు.

బోసిపోయిన రైతు సేవ కేంద్రాలు... సచివాలయ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాలు రైతు లకు సహకరించే విధంగా లేవనే చెప్పాలి. ఎందుకంటే ప్రభుత్వం జూన్ 30 నాటికి విత్తనాలు సమకూర్చు తోందని ఏ ఏలు తెలుపుతున్నారు. రైతుల అడిగే ప్రశ్నలకు సమాధానం లేకపోవడంతో సేవా కేంద్రాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సాధారణంగా మండ లంలో 13 వేల ఎకరాలు వరి సాగు భూమి ఉంది. ఇందుకుగాను గత ఏడాది 1000 క్వింటాళ్ల విత్తనాలు అందించామని, ఈ ఏడాది 1200 క్వింటాళ్ల వరకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికా రులు చెబుతున్నారు. మండలంలో ఉన్న 20 రైతు సేవా కేంద్రాల ద్వారా 1800 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రభుత్వానికి ఇండెంట్ అందించారు. సన్నాళ్ల ద్వారా అధిక ఆదాయం వస్తుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బ్లాక్ మార్కెట్లోకి నిల్వలు... ప్రభుత్వాలు వరి విత్తనాల సమ కూర్చటం లో మార్క్ ఫెడ్ అధికారులు కింగ్ కు ఊహించటం తో వ్యాపారు లు ఆయా ప్రాంతాలకు సరిపడే విత్తనాలను ఇప్పటికే గోదాముల్లో నిలువ ఉంచుతున్నారు. రాయితీపై ఇ చ్చే విత్తన ధరలకంటే మార్కెట్లో సుమారు 400 రూ పాయలు 30 కేజీల బ్యాగుకు వసూలు చేస్తున్నారు. వీరి ఆధార్ కార్డులు ఫోన్ నెంబర్లు సహాయంతో అధిక రేటుకు విక్రయించి బిల్లులో మాత్రం తో నిర్దేశించిన ధరలు మాత్రమే సూచించినట్లు తెలుస్తోంది. ప్రైవేట్ వ్యాపారుల అక్రమ దందాకు ఏపీ సీడ్స్ వారు స్థానిక వ్యవసాయ అధికారులు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది.

ఖరీఫ్ సీజన్ కు విత్తనాలు అందేనా... రైతులకు రాయితీపై అందించే విత్తనాలు ఖరీఫ్ సీజ న్లో అందేనా అని రైతుల ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సాంబ రకానికి 800 నుంచి 825 రూపాయలు ఉంటుంది. ప్రైవేట్ వ్యాపారుల వద్ద అదే బ్యాగు 1280 రూపాయలు ఉంటుంది. శ్రీదృతి, స్వర్ణ, అమర, ఇంద్ర రకాలు ప్రభుత్వ నిర్దేశిత ధర 960 రూపాయలు కాగ ప్రైవేట్ వ్యాపారుల పద్ద 1320 రూపాయలు గా ఉంది. ఇలా అధిక రేట్లకు విక్ర యించేందుకు వ్యాపారులు ఇప్పటికే వారి గోదాముల లో నిలువలు వేశారు. ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ వ్యాపారుల దందాను కట్టడి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తొలకరి పులకింతకు అన్నదాతకు విత్తనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

వైభవంగా నవగ్రహ మండపం పున:ప్రతిష్ట

జగదీశ్వర స్వామివారికి ఘనంగా కళ్యాణ మహోత్సవం

- ఘనంగా కుంకుమ పూజలు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని జగతి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న నవగ్రహ మండపం, పానమట్టం, ద్వజస్తంభం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో వైభవంగా నిర్వ హిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి వేదపండితులు ఆధ్వర్యంలో యంత్రస్థాపన, మూర్తిస్థాపన, ప్రాణప్రతిష్ట, విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. సాయింత్రం సామూహిక కుంకుమ పూజలు, స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల,సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ ఎన్. దాస్, దేవదాస్ రెడ్డి, జడ్పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, ఇచ్ఛాపురం ఏఎంసి చైర్మన్ మణి చంద్ర ప్రకాష్, జెడ్ఆర్యుసిసి సభ్యులు శ్రీనివాస్ రౌలో, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఆలయ కమిటి సభ్యులు, చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి

- వైసీపీ కార్యాలయంలో కరపత్రం విడుదల

విశాలాంధ్ర-టెక్కలి: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇచ్చిన హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైసిపి పార్టీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం విజయవంతం చేయాలని కోరుతూ టెక్కలి నియోజకవర్గం వైసిపి నాయకులు శనివారం కరపత్రాన్ని విడుదల చేశారు. వైసిపి టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీ ఉదయం 9 గంటలకు వైఎస్ఆర్ జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైసిపి శ్రేణులు ప్రజలంతా విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన నాయకులు నడుపూరు శ్రీరామమూర్తి, ఎర్ర చక్రవర్తి, సత్తారు సత్యం, తమన్నగారి కిరణ్, హనుమంతు వెంకటేశ్వరరావు, తమరి ఫల్గుణరావు,కిల్లి అజయ్ కుమార్, పోలాకి మోహన్ రావు, కనితి నారాయణమూర్తి, చిన్ని జోగారావు యాదవ్ బమ్మిడి తులసీరావు, కర్ణిక జీవనరావు, పీత రామనబాబు, పినకాన వైకుంఠరావు, అంబోడి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర-కవిటి: కిడ్నీ బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని జగతి గ్రామం కూటమి నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం జగతి సచివాలయం వద్ద కొత్తగా మంజూరు అయిన సి కే డి యు పింఛన్ కూటమి నాయకులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భావన సీతారామమూర్తి, తమరాల హరినాథ్, పిరియా జోగయ్య, భావన కామేష్, పూడి ప్రవీణ్, శమళ్ల సమీర్, శమళ్ల వేదవ్యాస్, పిరియా వెంకట్రావు, లమ్మత తవిటయ్య,లమ్మత వైకుంఠ రావు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్త రాజ్యలక్ష్మి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి ఎంతో హానికరం లయన్.డా.ఎం.కె.మిశ్రో

విశాలాంధ్ర-లక్ష్మీనర్సుపేట : లక్ష్మీ నర్సు పేట గ్రామంలో లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్పర్సన్బీదివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడుబీ సామాజిక వేత్తబీ బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శిబీ సక్షం జిల్లా కన్వీసర్బీసీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్బీగురు దేవా ఛారిటీ బుల్ ట్రస్ట్ ప్రతినిధిబీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్.డా.ఎం.కె.మిశ్రో ఆధ్వర్యంలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినం నిర్వహించారు.ఈ సందర్భంగా డా.మిశ్రో మాట్లాడుతూ ధూమపానం ఆరోగ్యానికి ఎంతో హానికరం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ. నారాయణరావు మరియు విద్యార్థి -విద్యార్ధినీలు పాల్గొన్నారు.

కామ్రేడ్ నంబాల కేశవరావుకు పలువురు నేతలు నివాళి

విశాలాంధ్ర-టెక్కలి : మావోయిస్ట్ అధినేత కామ్రేడ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మృతితో స్వగ్రామమైన జియ్యన్న పేటలో ఆయన కుటుంబ సభ్యులను కలసి కేశవరావు మృతి పట్ల పలువురు నేతలు నివాళు లర్పించారు. మాజీ స్పీకర్ వైకాపా నేత తమ్మినేని సీతారాం సతీసమేతంగా జియ్యన్న పేట చేరుకొని కేశవరావు చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించారు. సీతారాం తో పాటు పేడాడ తిలక్, జడ్పిటిసి సభ్యురాలు దువ్వాడ వాణి వీరితో పాటుగా కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన.మురళీ,టెక్కలి,కోటబొమ్మాళి ఎంపీపీ ప్రతినిధులు ఉమా.మల్లయ్య, ఆట్ల.రాహుల్ కుమార్,కోటబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు రాజు,అనిరుద్రుడు మాస్టర్,సూర్యారావు,వైస్ ఎంపీపీ ప్రతినిధి రామకృష్ణ రెడ్డి,జనార్ధన్,సర్పంచులు మోహన్ రెడ్డి, కామేష్, తదితరులు వైసీపీ నాయకులు నివాళు లు అర్పించిన వారిలో ఉన్నారు. కేశవరావు కుటుంబ సభ్యులు నంబాల డిల్లేశ్వరరావు, రాంప్రసాద్ తదితరులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

దళితుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

- తహసీల్దార్ మురళీమోహనరావు బెహరా

విశాలాంధ్ర-కవిటి: దళితుల హక్కులకు భంగం కలిగేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళీమోహన్ రావు బెహరా హెచ్చరించారు. ఈ మేరకు శనివారం కవిటి దళితవాడలో సివిల్ రైట్స్ డే సందర్భంగా మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితులకు ప్రభుత్వం కల్పించిన భూములను ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.ఈ సందర్భంగా దళిత హక్కులపై అవగాహన కల్పించారు.స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈవో వీరభద్ర స్వామి, వీఆర్వో సల్ల.నారాయణ,మాజీ జడ్పిటిసి సభ్యులు బి. రమేష్, మాజీ సర్పంచ్ ఆరంగి మధు,దళిత సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతామణి అమ్మవారి సంబరాలు

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం డొంకపుట్టుగ గ్రామ దేవత శ్రీ చింతామణి అమ్మవారి సంబరాలను ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మిరమిట్లు గొలిపే విద్యుత్తు అలంకరణతో పాటు ప్రతీ రోజు సాయింత్రం 3 గంటల నుంచి అమ్మవారిని మేళతాళాలు,కాళీకా నృత్యాలు, కోయిడాన్స్, గ్రూప్డాన్స్,ధూమ్ ధడక వంటి నాటకాలతో గ్రామంలో అమ్మవారిని ఊరేగింపు నిర్వహించడం జరుతుందని నిర్వాహకులు తెలిపారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

విశాలాంధ్ర-హిరమండలం/ పాతపట్నం : హిరమండలానికి చెందిన విద్యా ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో జాతీయ సూక్ష్మ, చిన్న, మరియు మధ్యతరహా పరిశ్రమల సంస్థ జాతీయ తేనెటీగల అభివృద్ధి బోర్డు వారి సహకారంతో సవర కురిడింగి గ్రామంలో వారం రోజుల శాస్త్రీయ తేనె తీగల పెంపకం పై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నా బార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ రమేష్ కృష్ణపాతపట్నం ఉద్యానాధికారిణిమంగమ్మ,లు హాజరయ్యారు. కార్యక్రమంలో రమేష్ కృష్ణ మాట్లాడుతూ వారం రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణానంతరం బ్యాంకు రుణాలు పొంది యూనిట్లు ప్రారంభించే దిశగా సంస్థ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారిణి మంగమ్మ మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా గిరిజన రైతులకు ఉన్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులుతేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని వినియోగించి నెలకొల్పే యూనిట్లకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలుపై తేనేపట్టు పెట్టెలు అందించబడతాయని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యా ఫౌండేషన్స్ అధ్యక్షులు ప్రసాద్ ఉదండరావు మాట్లాడుతూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామంలో ఉద్యానశాఖ సహకారంతో గ్రీన్ బర్డ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించబోయే కలెక్షన్ సెంటర్ మరియు సౌర శీతల గది రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రంలో గ్రీన్ బర్డ్ ఎఫ్.పి.ఓ సభ్యులు, డైరెక్టర్ మంగమ్మ ఉన్నారు.

ఫారం ఫండ్ల పట్ల రైతులకు అవగాహన కల్పించాలి

రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, శశిభూషణరావు

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫారం ఫండ్ల పట్ల జిల్లా రైతాంగానికి పూర్తిగా అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, శశిభూషణరావు అన్నారు. శనివారం ఆయన పట్టణంలో మండల పరిషత్ కార్యాలయంలో, చిన్న బొరిగివలస గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఫారం ఫండ్ల యొక్క ప్రాధాన్యతను తెలియచేయాలన్నారు. అనంతరం చిన్న బొరిగివలస గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న ఫారం ఫండ్స్ ఏర్పాట్లపై రైతులతో ఆయన ముఖాముఖి సమీక్ష నిర్వహించి, వేసవి కాలంలో వర్షాలు లేని సమయంలో పంట పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ఫారం ఫండ్ల వలన నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఫారం ఫండ్లలో నీరు నిల్వ చేయటం వలన పంట పొలాలు మట్టి క్రింద తడి కల్గి ఉంటాయని, తద్వారా రబీ పంటలకు నీరు ఇబ్బంది లేకుండా ఉంటుందని అన్నారు. దీనితో పాటు గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మామిడితోటను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి పనులపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్, ఫర్మాన్ అహ్మద్ఖాన్, డ్వామా పిడి, సుధాకరరావు, ఆర్డీఓ, సాయి ప్రత్యూష, జిల్లా, మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

జలుమూరులో పొగాకు వ్యతిరేక దినోత్సవం

విశాలాంధ్ర-జలుమూరు: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని శనివారంజలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకున్నారు పొగాకు వలన కలిగే నష్టాలను వైద్యాధికారిని ప్రసన్న లక్ష్మి వివరించారు ఆరోగ్య కేంద్రం నుండి కొంతవరకు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి చిన్న రాజులు వైద్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.